సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం, 12, మే, 2025



వైభవంగా బ్రహ్మోత్సవాలు

బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



ఆభరణం బహూకరణ

అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి ఓ భక్తుడు బంగారు కాసుల పేరును అందజేశారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /23.9

మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కనిపిస్తుంది. వేడి గాలులు వీస్తాయి. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

పోడు రైతుల్లో.. ఆశల చిగురు

'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకంతో విద్యుత్, సాగునీటి సౌకర్యం

- 18న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా మన్ననూర్‌లో ప్రారంభం
- గిరిజనుల కోసం రూ.12,600 కోట్లతో రూపకల్పన
- ఐదేళ్లలో 6 లక్షల ఎకరాలకు సాగునీటి కల్పనకు చర్యలు
- నల్లమలలోని 2.10 లక్షల మంది రైతులకు మేలు



కొల్లాపూర్ మండలం నార్లాపూర్ సమీపంలోని మలబస్వాపురం శివారులో అటవీ భూమిని సాగు చేస్తున్న కుడికిళ్ల రైతులు (ఫైల్)

అచ్చంపేట: నల్లమల చెంచు గిరిజనులను వ్యవసాయ పరంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు 18న మన్ననూర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ పథకం ప్రారంభించనున్నారు. ఇప్పటికే అధికారులు సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం కింద గిరిజన రైతులు భూములు పొందినా.. విద్యుత్, నీటి వసతి లేని కారణంగా ఏళ్ల తరబడిగా సాగుకు నోచుకోలేదు. ఇలాంటి భూములను సాగులోకి తీసుకువచ్చి.. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ.12,600 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకం అమలుకు అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నోచుకోక..

అటవీ ప్రాంతంలో పోడు భూముల సాగుకు కావాల్సిన విద్యుత్ సరఫరాకు ఎన్నో ఏళ్లుగా అటవీ శాఖ అనుమతించకపోవడంతో దశాబ్దాల తరబడి నిరీక్షిస్తున్నారు. రానున్న ఐదేళ్లలో 2.10 లక్షల మంది రైతులకు సంబంధించి 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం గిరిజన రైతులకు వరంలా మారనుంది. ఈ పథకం అమలులో ఐటీడీఏ, విద్యుత్, ఉద్యాన వన శాఖల అధికారుల పాత్ర కీలకంగా మారనుంది. పట్టాలు పొందిన గిరిజనులను ఎంపిక చేసి ఆ గ్రామంలోని భూముల్లో జల వనరుల లభ్యత కోసం జియాలజికల్ సర్వే అనంతరం బోర్లు వేయడం, సోలార్ పంపు సెట్లు బిగించడం, ప్లాంటేషన్, డ్రిప్ వంటివి ఏర్పాటు చేస్తారు. గిరిజన రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులను ప్రభుత్వమే కల్పించనుంది.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు..

మన్ననూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. అడవిలో సాగునీటి వసతి, కరెంట్ సౌకర్యం లేకుండా దశాబ్దాల తరబడి పంటలు పండించుకోవడానికి నిరీక్షిస్తున్న గిరిజన రైతులు ప్రభుత్వం తీసుకొస్తున్న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఏకకాలంలో గిరిజనులు పోడు భూములు సాగు చేసుకోవడానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించలేదు. సీఎం ఈ పథకం తీసుకురావడం ఆనందంగా ఉంది.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

ఎగుమతి చేసే విధంగా..

హిమాచల్‌ప్రదేశ్‌లో న్యాచురల్ స్లానింగ్ ద్వారా ఆర్గానిక్ కూరగాయలను పండించి ఢిల్లీకి ఎగుమతి చేస్తున్న మాదిరిగా ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలోని ఏజెన్సీ ఏరియాల్లో ఇదే తరహాలో కూరగాయలను పండించి హైదరాబాద్‌కు ఎగుమతి చేసే విధంగా కూరగాయల సాగుపై గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. దీని ద్వారా రైతులకు అదనంగా ఆదాయం లభించనుంది. అడవులను పెంచుతూనే.. గిరిజనులకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తుంది. ఈ పథకం అమలు కోసం రూపొందించిన విధి విధానాలను ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు. స్టేట్ లెవెల్ మానిటరింగ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కం పర్చేజ్ కమిటీ, ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

చెంచుల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం



బోరుబావులు తవ్వుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మన్ననూర్: చెంచులు ఆర్థికాభివృద్ధి సాధించే వరకు వారికి వెన్నంటి ఉంటూ పోత్సహిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఇందిర సౌర గిరి జల పథకంలో భాగంగా చెంచుల వ్యవసాయ పొలాల్లో తవ్వుతున్న బోరుబావులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని.. ఈ నెల 18న కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించామన్నారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో చెంచులు సాగు చేసుకుంటున్న ఆర్‌ఓఎఫ్‌ఆర్, పట్టా భూముల్లో బోర్లు తవ్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. బోరుబావులు తవ్విన తర్వాత స్ప్రింక్లర్లు, పంపుసెట్లకు సౌర విద్యుత్ అందిస్తామని.. ప్రస్తుత విధానాలకు అనుకూలంగా ఉద్యాన, వాణిజ్య పంటలు పండించే ఏర్పాట్లు కూడా చేస్తామని వివరించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, ఆర్డీఓ మాధవి, గ్రౌండ్ వాటర్ ఏడీ దివ్యజ్యోతి, డీటీడీఓ ఫిరంగి, డీపీఓ మోహన్‌రావు, జిల్లా ఉద్యాన అధికారులు జగన్, వెంకటేష్, ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ డీఈ జలంధర్, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీడీఓ వెంకటయ్య, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగుపై కార్యాచరణ

గిరిజనులు పంటలు సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకొనే విధంగా అవగాహన కల్పించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించారు. అవకాడో, వెదురు, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అంజీర్ వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పంటల సాగు జరుగుతున్న తీరుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించేందుకు స్టడీ టూర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరింది. పామాయిల్, వెదురు వంటి పంటలు చేతికి రావాలంటే కనీసం మూడేళ్ల సమయం పడుతుందని, ఈలోగా గిరిజనులకు ఆదాయం సమకూరేందుకు అవసరమైన అంతర పంటల సాగును గుర్తించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.

ఈత.. మృత్యువాత



మహబూబ్‌నగర్‌లోని స్టేడియం గ్రౌండ్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రాణాల మీదకు..

- ఉమ్మడి జిల్లాలో చెరువులు, కాల్వలను ఆశ్రయిస్తున్న వైనం
- వేసవి సెలవుల నేపథ్యంలో పెరిగిన ప్రమాదాలు
- తెలియని ప్రాంతాల్లో సాహసం చేయకపోవడమే ఉత్తమం
- అప్రమత్తం చేస్తున్న పోలీస్ యంత్రాంగం

మహబూబ్‌నగర్ క్రైం: ఈత నేర్చుకోవడం మంచిదే అయినప్పటికీ.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇటు కన్నవారికి తీరని శోకం మిగిల్చుతోంది. ప్రస్తుతం వేసవి సెలవుల్లో పిల్లలు ఈత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. అయితే జిల్లాలో ఈత కోసం వెళ్లి ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఈ మధ్యకాలంలో స్విమ్మింగ్ పూల్స్‌లోనూ ప్రమాదవశాత్తు మృతిచెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కాబట్టి ఈతకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కనీస జాగ్రత్తలు లేకే..

మండు వేసవిలో ఎండల నుంచి ఉపశమనానికి.. సెలవుల సరదాతో కాలక్షేపం కోసం ఈతకు వెళ్లడం అందరికీ అభిరుచిగా మారుతోంది. జిల్లాకేంద్రంతోపాటు ఇతర పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈత సరదా తీర్చుకునేందుకు అనువుగా స్విమ్మింగ్‌పూల్స్ వెలిశాయి. కానీ, ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువకులు, చిన్నారులు చాలా వరకు స్థానికంగా ఉండే బావులు, కుంటలు, చెరువులు, కాల్వలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో చాలామందికి ఈత రాకపోవడం, కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో ప్రమాదాల బారినపడుతున్నారు. వేసవిలో బాలలు, యువకులు జిల్లాలో ఈతకు వెళ్తూ నీటిలో మునిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు ఏటా పెరుగుతున్నాయి. నీటి లోతు, ఈత కొట్టే పద్ధతులు తెలియక అందులో మునిగిపోతుండగా రక్షణ చర్యలు కరవయ్యాయి.

- గత నెల 14న మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న క్వారీలో దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన విజయ్, మహిమూద్, సుశాంత్ ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు.
- ఈ నెల 1న నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి సమీపంలోని చెరువులో ఈత కోసం వెళ్లిన ముగ్గురు చిన్నారులు గణేష్ రెడ్డి, శ్రవణ్‌కుమార్, రక్షిత మృతి చెందారు.
- ఈ నెల 6న దేవరకద్రలో స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదవశాత్తు సన్నీ అనే బాలుడు మృతిచెందాడు.

ఆపద నుంచి రక్షించడం ఇలా..

ప్రత్యక్ష పద్ధతి ద్వారా నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే వీలుంటుంది. అయితే రక్షించబోయే వ్యక్తికి ఈత రావడంతోపాటు ధైర్యం కలిగి ఉండాలి. నీటిలో మునుగుతున్న వ్యక్తి వెనుక నుంచి వెళ్లి అతని వెంట్రుకలు, అండర్‌వేర్, మొలతాడు వంటి వాటిలో ఏదో ఒకటి పట్టుకొని ఒడ్డుకు తీసుకురావాలి.

పరోక్ష పద్ధతిలో..

ఈ పద్ధతి ద్వారా ఈత వచ్చిన వారితోపాటు రాని వారు కూడా నీటిలో మునుగుతున్న వారిని రక్షించవచ్చు. రక్షించే వారు నీటిలోకి దిగకుండా ఒడ్డున ఉండే ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఆసరాగా ఒడ్డు నుంచే ఏదైనా పట్టుకునేలా అందించాలి. దగ్గరగా ఉంటే కర్ర, టవల్, ప్యాంట్ వంటివి అందించాలి. దూరంగా ఉంటే తాడు, పొడవాటి కర్ర అందించి ఒడ్డుకు చేర్చాలి. నీటిపై తేలియాడే పరికరాలను నీటిలోకి విసిరి కూడా కాపాడవచ్చు.

ఒంటరిగా వెళ్లరాదు..

ప్రతిరోజు సెట్ కాన్ఫరెన్స్‌లో పోలీస్ సిబ్బందికి ఈత ప్రమాదాలపై సూచనలు చేస్తున్నాం. తల్లిదండ్రులు వారి పిల్లలను జలాశయాలు, చెరువులు, కాల్వలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా పోలీసులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జలాశయాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వేసవి సెలవులు కావడంతో చాలామంది పిల్లలు, యువకులు ఎండ వేడి నుంచి సేద తీరడానికి, ఈత నేర్చుకోవడానికి జలాశయాల వద్దకు వెళ్లినప్పుడు ప్రమాదాలు జరిగిన నీటిలో మునిగి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఈత రాని వాళ్లు ఒంటరిగా నీటిలోకి వెళ్లరాదు. పిల్లలు వారి తల్లిదండ్రులు లేదా శిక్షకుల సమక్షంలో ఈత నేర్చుకోవాలి.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ప్రథమ చికిత్స ముఖ్యం



నీటిలో ప్రమాదానికి గురైన వ్యక్తిని ఒడ్డుకు చేర్చగానే అతడిని వెల్లకిలా పడుకోబెట్టాలి. అవసరమైతే నోట్లో నోరు పెట్టి శ్వాస ఊదుతూ కృత్రిమ శ్వాస అందించాలి. ఛాతిపై చేతులతో ఒత్తాలి. దీంతో శ్వాస పెరుగుతుంది. ప్రథమ చికిత్స అందిస్తూనే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నప్పుడు అక్కడ సుశిక్షితులైన కోచ్‌లు, ఇతర సిబ్బంది రక్షణ చర్యలు ఉన్నాయో లేదో పెద్దలు పరిశీలించాల్సిన తర్వాతే పిల్లలను పంపించాలి.

- చెరువులు, కాల్వల్లో ఈతకు వెళ్తున్నప్పుడు బాలల వెంట పెద్దవారు తప్పకుండా ఉండాలి.
- కొత్త ప్రదేశంలో బావులు, కాల్వలు, చెరువుల్లో ఈత కొట్టే ముందు కర్ర సహాయంతో లోతును పరిశీలించాలి. ఈత రాని వారు నేర్చుకునేందుకు ట్యూబ్‌లు, ఇతర పరికరాలను ఉపయోగించి పూర్తిగా ఈత కొట్టడం వచ్చాకే లోతుకు వెళ్లాలి.
- ప్రస్తుతం వేసవి సెలవులు కాబట్టి పిల్లలు బయటికి వెళ్లి చాలా సమయం అయితే వారి వారి తల్లిదండ్రులు పిల్లల సమాచారంపై వాకబు చేసుకొని చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది.
- విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు స్నానం ఆచరించాలే తప్ప అక్కడి వాటిలోకి వెళ్లి ఈత కొట్టడం చేయవద్దు.
- మట్టిని లోతుగా తవ్విన ప్రాంతాల్లో నిలిచిన నీటిలో లోతు తెలియదు. కాబట్టి ఇలాంటి వాటిలో ఈతకు సాహసం చేయరాదు.
- జిల్లాలో కృష్ణానది, జూరాల, కోయిల్‌సాగర్, ఇతర జలాశయాలకు వెళ్లినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

అమరవీరులకు ఘన నివాళి



తిమ్మాజిపేట: మండలంలోని గొరిటలో ఆదివారం రాత్రి భారత్–పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు ఘన నివాళి అర్పించారు. గ్రామ వీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి చివరగా దేవాలయం సమీపంలో అమరవీరుల చిత్రపటాలు ఏర్పాటుచేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, కోశాధికారి నోబుల్‌రెడ్డి, సలహాదారులు రాంగోపాల్, శాంతయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కందనూలు: జిల్లాలో ఈ నెల 13న జరగనున్న పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ జిల్లా కన్వీనర్ మదన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 9 కేంద్రాలు ఏర్పాటు చేశామని.. జిల్లాకేంద్రంలో 8, పాలెంలో ఒక కేంద్రం ఉన్నట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష కొనసాగనుండగా.. 2,805 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఇందులో 1,354 మంది బాలురు, 1,451 మంది బాలికలు ఉన్నారని.. ప్రతి కేంద్రాన్ని జీపీఎస్‌తో అనుసంధానించినట్లు వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ, బ్లాక్‌పెన్ తీసుకొని గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ ఎం.అంజయ్య సెల్‌నంబర్ 94918 77502 సంప్రదించాలన్నారు.

అడుగంటుతున్న కోయిల్‌సాగర్

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ఆదివారం 11.6 అడుగులకు చేరింది. యాసంగి సాగుకు ముందు ప్రాజెక్టులో 31.6 అడుగుల నీటిమట్టం ఉండగా పంటలు పూర్తయ్యే నాటికి 13.3 అడుగులకు చేరింది. యాసంగి సాగు పూర్తయిన తర్వాత ప్రాజెక్టు మూడు పంప్‌హౌస్‌ల నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో మూడు వారాల్లో 1.9 అడుగులు తగ్గింది. ప్రాజెక్టులో ప్రస్తుతం 11.6 అడుగుల నీరు ఉంది.

వికసించిన మే పుష్పం



ప్రకృతి ప్రియులను అలరించే 'మే' పుష్పం వికసించింది. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే పూచే ఈ పువ్వు ఎరుపు రంగులో కనువిందు చేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా 17వ వార్డులోని పాపయ్యనగర్‌లో రిటైర్డ్ పోస్టుమాస్టర్ నరసింహసాగర్ నివాసంలోని పెరటితోటలో ఈ పుష్పం వికసించింది. దీన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ఇళ్ల వారు ఆసక్తి చూపారు. స్కాడో క్సస్ మల్టీఫ్లోరస్ అనే శాస్త్రీయ నామం ఈ మొక్కను ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీగా పిలుస్తారని జడ్చర్లలోని బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య తెలిపారు. దీనిని మనదేశంలో మే పుష్పం అంటారని, ఇది మూడు రోజుల పాటు వికసించి ఉంటుందని పేర్కొన్నారు. – నాగర్‌కర్నూల్

బాతుల సందడి



వేసవి ఎండలతో చిన్న ప్రాణులకూ ఇబ్బందులు తప్పడంలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం బాతు పిల్లలతో పాన్‌గల్ గ్రామానికి చేరుకున్నారు. బాతు పిల్లలను గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వ సమీపంలోని పంట పొలాల్లో తిప్పుతూ పెంచుతున్నారు. ఆదివారం ఎండ వేడిమి తాళలేక బాతు పిల్లలన్నీ కేఎల్ఐ కాల్వలోకి దిగి.. నీటిలో సేతదీరుతూ సందడి చేశాయి. – పాన్‌గల్

నాలుగు తరాల అను'బంధం'



ఒకే కుటుంబం.. నాలుగు తరాలు.. 123 మంది కుటుంబ సభ్యులు.. 50 ఏళ్ల తర్వాత ఒకచోట కలిసిన అపూర్వ ఘట్టం. మదర్స్‌డే సందర్భంగా వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెలగొండలో వంశాధిపతి బూజుల నరసమ్మ, అక్కిరెడ్డిల వారసులు నాలుగు తరాలకు చెందిన 123 మంది సభ్యులందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుతం బంధాలను చరవాణులకే పరిమితం చేసి, బంధువులు సైతం ఒకరినొకరు పరిచయం చేసుకునే దుస్థితి ఉంది. ఇలాంటి రోజుల్లో నాలుగు తరాలకు చెందిన 123 మంది కుటుంబసభ్యులు ఒకే వేదికపై కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. దేశంలో వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లో ఉన్నవారు సైతం ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ వంశాధిపతిబూజుల నరసమ్మ, అక్కిరెడ్డిలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకను కుటుంబసభ్యుల్లో ఒకరు, స్థానిక బీజేపీ నాయకుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. – చిన్నంబావి (వనపర్తి జిల్లా)

క్లుప్తంగా

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న బైక్: వ్యక్తి మృతి



ఇబ్రహీం (ఫైల్)

కొత్తకోట రూరల్: రోడ్డు పక్కన ఆగివున్న డీసీఎంను బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున కొత్తకోట సమీపంలో జాతీయ రహదారి 44పై చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా ముత్కూర్ గ్రామానికి చెందిన దూదేకుల అల్లాబకాష్ కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని మల్కాజిగిరిలో నివాసం ఉంటున్నాడు. ఈయన కుమారుడు దూదేకుల ఇబ్రహీం (29) హైదరాబాద్‌లోనే ప్రైవేట్ జాబ్ చేస్తుండేవాడు. స్వగ్రామంలో పని నిమిత్తం ఇబ్రహీం తన బైక్‌పై శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున ఇబ్రహీం కొత్తకోట సమీపంలో హైవే పై ఆగివున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి అల్లాబకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

మాగనూర్ (మక్తల్): మక్తల్ మండలంలోని నారాయణపేట రోడ్డులో గల కాటన్ మిల్లు సమీపంలో సంగంబండ లెఫ్ట్ కెనాల్‌లో ఆదివారం ఉదయం గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. మహిళ శవం కాల్వలో పడి సుమారు రెండు, మూడు రోజులై ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. శవం కుళ్లిపోయిన దశలో ఉందన్నారు. మహిళ వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండొచ్చన్నారు. అటువైపు వెళ్తున్న వారి సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి కుళ్లిపోయిన మహిళ శవాన్ని కాల్వలో నుంచి పైకి తీసుకొచ్చామని, శరీరంపై గులాబీ రంగు జాకెట్, నల్ల రంగు లంగ, మెడలో మూడు తాయత్తులు ఉన్నాయన్నారు. ఈ ఆనవాళ్లతో ఎవరికైనా సమాచారం ఉంటే మక్తల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

జమ్ములమ్మ ఆభరణాలు చోరీ

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో జమ్ములమ్మ అమ్మవారి ఆలయంలో ఆభరణాలు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, భక్తుల వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జమ్ములమ్మ ఆలయంలో ప్రవేశించి అమ్మవారి కిరీటం, నగలు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గత కొంతకాలంగా హుండీలు పగులగొట్టి అందులోని నగదు, తాళాలు పగులగొట్టి ఆలయాల్లో విలువైన వస్తువులు చోరీ చేస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ పెంచి గ్రామం వెలుపల ఉన్న ఆలయాలకు రక్షణ కల్పించి భవిష్యత్‌లో ఆలయాల్లో చోరీలు జరగకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

మామిడి.. మాగించే పద్ధతులు



మాగించేందుకు సిద్ధంగా ఉన్న మామిడి



పసుపు రంగులో ఉన్న మామిడి

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్ : పండ్లు అన్నింటిలో రారాజు మామిడి పండు. మామిడిలో పోషకాలు మెండుగా ఉంటాయి. అందుకే మామిడిని పండ్లకు రాజుగా గుర్తిస్తారు. ఇందులో విటమిన్-సీ 76 శాతం, విటమిన్-ఏ 25 శాతం, విటమిన్-బీ6 11 శాతం, ఫైబర్(పీచు) 9 శాతం, రాగి 9 శాతం పొటాషియం 7 శాతం, మెగ్నీషియం 4 శాతం ఉంటుంది. వేసవి కాలంలో మామిడికి అధిక డిమాండ్, విదేశాలకు సైతం ఎగుమతి చేస్తుండడంతో వాటిని మాగించే పద్ధతులు, కోత కోసే సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు.

ఇలా మాగించడం మేలు

మార్కెట్‌లోకి పంచదార, కలప వంటి రకాలు ముందుగా వస్తాయి. పెద్ద రసం, చిన్న రసం, చెరుకు రసాల రకాలు తర్వాత అందుబాటులోకి వస్తాయి.ఆ తర్వాత బేనిషా, నీలం, బెంగుళూరు(తోతపరి, కలెక్టర్) రకాలు మార్కెట్‌లోకి వస్తాయి. ముందుగా వచ్చే పండ్లకు నాణ్యత ఉండదు. కార్బైట్‌ను ఉపయోగించి రంగును తెప్పించి విక్రయిస్తారు. అయితే చెట్టుపై నుంచి కోసిన పండ్లను సాధారణ పద్ధతిలో మాగించడం వల్ల మంచి రుచిని కలిగి ఉంటాయి. పండ్లను ఇలా మాగించడానికి ఒక గదిలో గడ్డి లేదా వరిగడ్డి పరచి వాటిపై కాయలు పేర్చి మళ్లీ గడ్డిని కప్పాలి. ఇలా చేస్తే రెండు మూడు రోజుల్లోనే కాయలు మాగుతాయి. ఇక పండ్లకు మంచి రంగును తెప్పించడానికి ఇథైల్‌ను ఉపయోగించవచ్చును. ఇది కెమికల్ కాదు. ఒక హార్మోన్. లీటర్ నీటికి 1 ఎంఎల్ నుంచి 1.8 ఎంఎల్‌ను ఉపయోగించి కాయలన్నీంటికీ సమానంగా రంగును తెప్పించి మాగపెట్టవచ్చును. ఇథైల్‌ను వేడి నీటిలో 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద కలిపి కాయలను 5 నిమిషాలు ముంచి తీసి ఆరబెట్టినా మంచి రంగు వస్తాయి. మామిడి పండ్లను చెక్కపెట్టల్లో కాకుండా సీఎఫ్‌బీ పెట్టెల్లో ఉంచి రవాణ చేయడం ఉత్తమం. 5–10 కిలోల వరకు పెట్టెల్లో ఉంచి దూర ప్రాంతాలకు రవాణ చేయడం వలన పండ్లు దెబ్బతినవు.

కాల్షియం కార్బైట్‌తో మాగించడం వలన..!

కొంత మంది రైతులు, వ్యాపారులు కాయలను మాగపెట్టడానికి ప్రమాదకరమైన పద్ధతులు పాటిస్తున్నారు. కాల్షియం కార్బైట్‌ను అధికంగా వినియోగించి సరిగ్గా పక్వానికి రాని కాయలను కృత్రిమంగా రంగు తెప్పించి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇలా మాగబెట్టినవి తినడం వలన ఆరోగ్యానికి హానికి కలిస్తాయి.

ఇథైల్ వాడకం శ్రేయస్కరం..

మామిడి కాయలను మాగించడానికి ఇథైల్ వాడకం శ్రేయస్కరం. దీన్ని ఉపయోగించడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు. ఇది పండుకు తీపిదనంతో పాటు మంచి సువాసనను ఇస్తోంది. ఇథైల్ వాడకంతో మామిడి కాయాల్లో ఇథీలిన్ వాయువు ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. అందువల్ల రైతులు కార్బైడ్ ఉపయోగించకుండా ఇలా మాగపెడితే రైతుకు మంచి ధర లభిస్తోంది.

గ్రేడింగ్ విధానం : కాయాలను గ్రేడింగ్ చేయడం ద్వారా అవసరమైన సైజు (పరిమాణం), రంగు, బరువును బట్టి వేరు చేసి విక్రయిస్తే మంచి ధర లభించే అవకాశం ఉంటుంది. అలాగే ఆవిరి (వేపర్ ట్రీట్‌మెంట్) ద్వారా కాయలను శుభ్రం చేసి విక్రయించినా అధిక ధర లభిస్తుంది. 200–250 గ్రాములు ఉన్న వాటిని ఒక గ్రే డ్‌గా, 300–350 బరువు ఉన్న వాటిని ఇంకో గ్రేడ్‌గా విడగొట్టి విక్రయిస్తే మంచి లాభాలు పొందవచ్చు.

25 ఏళ్లకు కలిసిన పేగుబంధం

- ఆర్థిక సమస్యలతో వెళ్లిపోయిన మన్సూర్‌అలీ
- గ్రామస్తుడి సమాచారంతో తిరిగి ఇంటికి చేరిన వైనం



కుటుంబ సభ్యులతో మన్సూర్ అలీ

దేవరకద్ర రూరల్: ఆర్థిక సమస్యలతో విసిగివేసారి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయిన ఓ వ్యక్తి.. 25 ఏళ్లకు తిరిగివచ్చిన సంఘటన ఆదివారం మండలంలోని గుడిబండలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుడిబండకు చెందిన మన్సూర్‌అలీకి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా.. వివిధ కారణాలతో కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీంతో అప్పుల బాధ పెరిగిపోయి మనస్తాపానికి గురైన మన్సూర్‌అలీ ఇంట్లో కూలీ పనులకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మన్సూర్‌అలీ భార్యనే ఇంటి పెద్ద దిక్కుగా మారి కూలీ పనులు చేస్తూ, కుటుంబాన్ని పోషించి పిల్లల పెళ్లిళ్లు సైతం చేసింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పనినిమిత్తం బెంగళూర్ వెళ్లగా అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మన్సూర్‌అలీని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అతడి కుమారుడు యూనిస్ బెంగుళూరు వెళ్లి తన తండ్రిని తిరిగి ఇంటికి తీసుకువచ్చాడు. ఒకానొక దశలో లేడు అనుకున్న వ్యక్తి తిరిగి ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆర్థికంగా ఎదగలేకపోవడంతో కుటుంబానికి మొహం చూపించలేక తిరిగి రాలేకపోయినట్లు మన్సూర్‌అలీ తెలిపారు.

చోరీ కేసులో మహిళకు 14 రోజుల రిమాండ్

గోపాల్‌పేట: చోరీకి పాల్పడిన మహిళకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రేవల్లి ఎస్సై రజిత తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్‌కు చెందిన నల్లపోతుల బుజ్జమ్మ శనివారం రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో బాలకృష్ణ చారి అనే వ్యక్తి ఇంట్లో కేబుల్ చోరీ చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని ఆదివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరుచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈమె గతంలో నాగర్‌కర్నూల్, బిజినపల్లిలో కూడా చోరీలు చేయగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

రేవల్లి మండలంలోని కొత్తతాండకు చెందిన కృష్ణనాయక్, రేక్యనాయక్ ఇరువులు ఇళ్ల మధ్య ఉన్న శేరు సందు విషయంలో తరచూ గొడవ పడేవారు. శనివారం కూడా గొడవ పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజిత పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గుడిసెలు దగ్ధం



విద్యుదాఘాతంతో మంటలో కాలుతున్న గుడిసెలు

కేటీదొడ్డి: విద్యుదాఘాతంతో రెండు గుడిసెలు దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు దొంబర వీరన్న వివరాల ప్రకారం.. పొలం దగ్గర ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్న గుడిసెలో విద్యుదాఘాతం వల్ల మంటలు చెలరేగి గుడిసె పూర్తిగా కాలిపోగా, పక్కనే ఉన్న బర్రెల షెడ్‌కు మంటల వ్యాపించి షెడ్ కూడా పూర్తిగా కాలిపోయింది. బర్రెలు బయట ఉండటంతో ప్రమాదం తప్పింది. గుడిసెలో టీవీ, ఇన్‌వెటర్, సీసీ కెమెరాలు, గడ్డి కట్‌చేసే యంత్రం మంటలో కాలుతుండగా గమనించిన స్థానికులు మంటలు అర్పడానికి ప్రయత్నించారు. అప్పటికే పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో దాదాపు రూ4.లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు.

అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ



జోగులాంబ అమ్మవారికి బంగారు కాసుల పేరు అందజేస్తున్న భక్తులు

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన అలంపూర్ క్షేత్రంలో ఐదవ శక్తిపీఠంగా కొలువైన శ్రీజోగుళాంబ అమ్మవారికి భక్తులు ఆదివారం బంగారు కాసుల పేరును బహుకరించారు. ఏపీలోని కర్నూలుకు చెందిన శివ చరణ బ్రహ్మచారి సస్య గ్రూప్ శ్రీనివాస్ దంపతులు, కృష్ణ మోహన్ దంపతులు ఈ బంగారు ఆభరణాన్ని బహుకరించినట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. భక్తులు సమర్పించిన బంగారు ఆభరణం 118 గ్రాముల బరువు ఉండగా విలువ రూ.11 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా ప్రసాద్ స్కీంలో భాగంగా అన్నదాన సత్రంలో భక్తుల కోసం రూ.50 వేల విలువ గల 25 స్టీల్ టేబుల్స్‌ను విరాళంగా అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



ఆంజనేయస్వామికి ఉపనయనం పూజలు చేస్తున్న అర్చకులు



వైభవంగా స్వామివారి ప్రభోత్సవం

ఇటిక్యాల: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉత్సవాలలో భాగంగా ఆలయంలో రెండో రోజు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, ఉపనయనం, పల్లకీసేవ, పూజలు నిర్వహించారు. రాత్రి ప్రభోత్సవం (చిన్నతేరు) కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ విజేతల మనోగతం

అధ్యాపకుల సలహాల వల్ల..



ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి డాక్టర్ కావాలన్న లక్ష్యంతో చదివాను. ప్రతి రోజు 12 నుంచి 14 గంటల దాకా చదివేదాన్ని, కళాశాలలో అధ్యాపకులు, యాజమాన్యం సూచనలు, సలహాలతో ర్యాంకు సాధించడం చాలా సులువుగా మారింది. నీట్‌లో కూడా మంచి ర్యాంకులు సాధిస్తాననే నమ్మకం ఉంది.

– సువర్ణకుమారి, 73వ ర్యాంకు, అగ్రికల్చర్, రిషి కళాశాల

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం..



కళాశాలలో అధ్యాపకులు చెప్పిన పాఠాలతో పాటు మంచి మెటీరియల్ చదవడం, ప్రతిరోజు కళాశాలలో పెట్టే గ్రాండ్ టెస్టులు రాయడం వల్ల ఎప్‌సెట్ పరీక్ష రాయడం చాలా సులువుగా మారింది. డాక్టర్ కావాలన్న లక్ష్యం కోసం ప్రతి రోజు చదివేందుకు ఎక్కువ సమయం కేటాయించాను. భవిష్యత్‌లో మరింత రాణించేందుకు కృషి చేస్తాను.

– భావన, 371, అగ్రికల్చర్, ప్రతిభ కళాశాల

ప్రత్యేక బోధన వల్ల..



కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. అధ్యాపకులు, యాజమాన్యం తరగతి గదిలో వచ్చిన సందేహాలను వెంటనే నివృతి చేశారు. అందువల్ల చదువులో ఎలాంటి సందేహాలు లేకుండా అర్థం అయ్యేది. డాక్టర్ కావాలన్న లక్ష్యం కోసం ప్రతి రోజు కష్టపడి చదివాను. భవిష్యత్‌లో మరింత రాణిస్తాం.

– సాయి దీపిక, 741, అగ్రికల్చర్, వాగ్దేవీ కళాశాల

మరోసారి 'రిషి' విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన టీజీఎప్‌సెట్ ఫలితాలలో మహబూబ్‌నగర్‌లోని 'రిషి' జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి 73వ ర్యాంకు సాధించి పాలమూరు జిల్లా విద్యాఖ్యాతిని సగర్వంగా నిలిపారని కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకట్, అకాడమిక్ అడ్వైజర్ వెంకటయ్య పేర్కొన్నారు.అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారు అగ్రికల్చర్, ఫార్మ విభాగంలో స్వర్ణకుమారి 73వ ర్యాంకు, హఫ్సఫాతిమా 604వ ర్యాంకు, జ్యోతిక 634వ ర్యాంకు, సిరి 859 ర్యాంకు, అలాగే 5,000 లోపు ర్యాంకులు 25 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో ప్రణీత్ కుమార్ 1,521 ర్యాంకు, అహ్మద్ ఇస్రార్ మునావర్ 1,726 ర్యాంకు, అలాగే 10,000 లోపు ర్యాంకులు 37 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.కార్యక్రమంలో అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్ రెడ్డి,ప్రిన్సిపల్ ప్రసన్న కుమారి, రాఘవేంద్రరావు,అధ్యాపకులు, అధ్యాపకేతర బందం పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో సత్తాచాటిన 'ప్రతిభ'



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీజీఎప్‌సెట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటారు. ఇంజినీరింగ్ విభాగంలో కళాశాల విద్యార్థులు వాత్సల్య 531, జతిన్ 603, శివశంకర్‌గౌడ్ 1.251, ఎం.భానుప్రతాప్ 1,561, శ్రీవత్స 2,251, అభిరాం 2,459, మల్లేష్ 2,560, పల్లవి 2,868, హర్షన్ 2,767, సుమేర్ 2,972, భవాని 3,018, సాయిజశ్వంత్‌రెడ్డి 3,043, సాకేత్‌కుమార్‌రెడ్డి 3,213 ర్యాంకులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మ విభాగంలో కె.భావన 371, భీమేశ్వరి 616, ఉమైమసారి 680, శ్రుతి 834, సుప్రియ 922, పావని 1,054, శ్రీచందన 1,170, సుప్రజ 1,186, ప్రణవసాయి 1,331, సిద్ధికనౌషీన్ 1,443, మసూర రహిల 1,522, శ్రావణి 1,565, స్ఫూర్తి 1,721, సౌందర్య 1,836, అక్షర 2,493, మానిక 3,094, శ్రావణి 3,822, సౌమ్య 3.849 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ సలహాదారు మంజూలాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణుజనార్దన్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవీ విద్యార్థుల విజయదుందుభి



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు టీజీఎప్‌సెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులతో విజయకేతనం ఎగురవేశారు కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సాయి దీపిక 741, జవేరియా 1,279, రబ్బా 2,191, తబ్రీజ్ 3,483, శ్రీహరి 5,223, నూరిన్ 5,486, రాజేశ్వరి 5,627, ప్రియాంక 7,052, వైష్ణవి 7,162, సీమ 8,353, నవనీత్ కుమార్‌గౌడ్ 8,391, పవన్‌కల్యాణ్ 8,613, అనుష్క 8,638, అబేదా 8,684, మానిక 8,730, జ్ఞానేశ్వర్ 9,468, యమునా 9,573 ర్యాంకు సాధించారు. వీరితో పాటు 15 వేల ర్యాంకు లోపు 22 మంది విద్యార్థులు 20 వేల ర్యాంకు లోపు 29 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి ఐఐటి నీట్ అకాడమీ ఇంచార్జ్ పావని రెడ్డి ఎంసెట్ ఇంచార్జ్ షాకీర్ యాజమాన్య సభ్యులు రాఘవేంద్రరావు, కోట్ల శివకుమార్, నాగేందర్, అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.